క్లుప్తంగా

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి


సాగర్ (ఫైల్)

ఎల్కతుర్తి : ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన భీమదేవరపల్లి మండలంలోని రాంనగర్ గ్రామ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ముల్కనూర్ గ్రామానికి చెందిన సుంచు సాగర్ (30) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన రాంనగర్ సమీపంలో కొత్తగా వ్యవసాయ బావి నిర్మాణ పనులు చేపడుతుండగా కూలీ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. ఎస్సై మహేందర్ ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని హుజురాబాద్ మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతున్న ఫీల్డ్ అసిస్టెంట్..


రాజ్‌కుమార్ (ఫైల్)

కమలాపూర్ : ఆర్థిక ఇబ్బందులతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఫీల్డ్ అసిస్టెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్సై ఎం.సతీశ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ తుపాకుల రాజ్‌కుమార్ (32) కొద్ది రోజులుగా అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నాడు. ఆయన ఈనెల 1న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పారు. అక్కడ చికిత్స పొందుతుండగా శనివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి సోదరుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడికి కత్తిపోట్లు


గాయపడిన దినేష్

పరకాల : పట్టణంలోని కూరగాయాల మార్కెట్ సమీపంలో యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. వివరాలిలా.. కిరాణం షాప్ నడుపుకుంటున్న రాజ్‌పురోహిత్ దినేశ్‌చంద్రపై మరో యువకుడు శుక్రవారం రాత్రి కత్తితో దాడి చేశాడు. బాధితుడు దినేష్ 21వ వార్డు కౌన్సిలర్ జయంత్‌లాల్ సోదరుడు ఘటన చర్చనీయాంశంగా మారింది. దినేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. పాత కక్షల నేపథ్యంలో తన సోదరుడు దినేష్‌పై దాడి చేసిన సర్వ ధనుష్, అతని కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని దినేష్ సోదరుడు ఆర్పీ.మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో పశుగ్రాసం దగ్ధం

● మంటల్లో చిక్కుకుని లేగదూడ మృతి


మంటలను ఆర్పుతున్న పోలీస్ సిబ్బంది

ఎల్కతుర్తి : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామ శివారులో శనివారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకోగా పశుగ్రాసం దగ్ధం కావడంతోపాటు ఓ లేగదూడ మంటల్లో కాలి మృతి చెందింది. గ్రామ రైతుల కథనం ప్రకారం.. గోపాల్‌పూర్ శివారులో ప్రమాదవశాత్తు కోయకాలు అంటుకొని చెలరేగిన మంటల్లో గ్రామానికి చెందిన రైతులు బోయినపల్లి కిషన్‌రావు, తిరుపతిరావులకు చెందిన రూ.30 వేల విలువైన డ్రిప్ పైపులతోపాటు పశుగ్రాసం కాలి బూడిదైంది. అలాగే కొట్టంలో ఉన్న సూడి లేగదూడ సైతం మంటల్లో చిక్కుకొని కాలిపోయింది. స్థానిక రైతులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మొక్కజొన్న చేను, విద్యుత్ మోటార్లు..

దామెర : ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని మొక్కజొన్న చేను, విద్యుత్ మోటార్లు దగ్ధమైన ఘటన మండలంలోని పులుకుర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు తన మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగి చుట్టుపక్కన ఉన్న పెంచాల రాజు, రమేష్, శ్రీనివాస్, భిక్షపతి, సంతోష్, కుమారస్వామి దేవేంద్రలకు చెందిన పంట భూములకు వ్యాపించాయి. దీంతో సదరు రైతులకు సంబంధించిన మొక్కజొన్న కంకులు, విద్యుత్ మొటార్లు, పైపులు కాలిపోయాయి. అగ్నిప్రమాదం నేపథ్యంలో సుమారు రూ.3 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.


శాయంపేట : ఎడ్లబండిలో వస్తున్న గండ్ర జ్యోతి


ఎల్కతుర్తి : ర్యాలీలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్


కమలాపూర్ : ఎడ్లబండిలో వస్తున్న కౌశిక్‌రెడ్డి

సాగునీటి రంగంలో స్వర్ణయుగం

● వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

శాయంపేట : తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ సీఎంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి మూడేళ్లలో భూగర్భ జలాలను భారీగా పెంపొందించడంతో రాష్ట్రంలో సాగునీటి రంగంలో స్వర్ణయుగం వచ్చిందని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండలంలోని గట్లకానిపర్తి, పెద్దకోడెపాక, శాయంపేట గ్రామాల్లో రైతులు, అధికారులు ర్యాలీ నిర్వహించగా ఎడ్లబండిలో రైతు వేదికకు ఆమె చేరుకున్నారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన రైతు దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని 13 హెక్టార్లలో పంట సాగు విస్తీర్ణం పెరిగిందని, 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ రైతులకు సన్మానం

ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ సహకారంతో మండలంలోని గ్రామాల్లో చేపట్టిన రీజనరేటీవ్ అగ్రికల్చర్ ప్రాజెక్టులో భాగంగా ఉత్తమ రైతులుగా గుర్తింపు పొందిన కోల మచ్చయ్య, గాజ రాజేందర్, వజీర్ శంకర్‌రావు, మూతురాల నాగేశ్వర్‌రావు, పిన్నింటి కిషన్‌రెడ్డిలను మండల కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిశెట్టి లతలక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, సర్పంచ్‌లు బొమ్మకంటి సాంబయ్య, ప్రకాశ్‌రెడ్డి, కందగట్ల రవి, ఎంపీటీసీలు బాసాని చంద్రప్రకాశ్, రజిని, వేణుగోపాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పండుగలా వ్యవసాయం.. : ఎమ్మెల్సీ

కమలాపూర్ : తెలంగాణ ఏర్పడి సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టాక వ్యవసాయాన్ని పండుగలా మార్చారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. కమలాపూర్, శనిగరం, గూడూరు గ్రామాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన రైతు దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు రైతుల కష్టాలు తెలుసని, అందుకే రైతుబంధు అందజేస్తున్నాడని తెలిపారు. రుణమాఫీ చేయడంతోపాటు రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నారని చెప్పారు. తొలుత కౌశిక్‌రెడ్డికి రైతులు ఎండ్లబండ్లు, ట్రాక్టర్ల ర్యాలీతో ఘన స్వాగతం పలుకగా కౌశిక్‌రెడ్డి ఎడ్లబండి నడుపుతూ రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. మండలంలోని మర్రిపల్లిగూడెం క్లస్టర్‌లోని వంగపల్లి, ఉప్పల్ రైతు వేదికల్లోనూ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్, మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్, జిల్లా నోడల్ అధికారి శ్రీనివాస్, ఆర్డీఓ హరిసింగ్, తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ పల్లవి, ఏపీఓ రమేష్, ఎంపీఓ విమల, ఏఓ లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచులు విజయ తిరుపతిరెడ్డి, సాంబయ్య, రవళి రంజిత్‌రెడ్డి, గోపాల్, దేవేందర్‌రావు, కమలమ్మ, రవీందర్, కిరణ్మయి విజయ్‌కుమార్, రజిత తదితరులు పాల్గొన్నారు.


శాయంపేట : మాట్లాడుతున్న గండ్ర జ్యోతి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో రైతులు, అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ర్యాలీలో పాల్గొని ఉత్సాహం అందించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనిత మాట్లాడారు.

కలెక్టర్ పరిశీలన

మండల కేంద్రంలోని రైతు వేదికను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. రైతు దినోత్సవ వేడుకల్లో ఎంత మంది రైతులు పాల్గొన్నారనే విషయమై ఆరా తీశారు. కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, పరిశీలకురాలు హరిత, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, వైస్ ఎంపీపీ తంగెడ నగేశ్, సర్పంచ్‌లు కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ రామునాయక్ మాట్లాడారు. తొలుత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉత్తమ రైతులను, వ్యవసాయ కూలీలను, కార్మికులను ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.స్వర్ణలత, జెడ్పీటీసీ సిలువేరు మొగిలి, మార్కెట్ కమిటీ చైర్మన్ సారంగపాణి, వైస్ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పరకాల : మాట్లాడుతున్న ఆర్డీఓ రామునాయక్

దామెర : మండలంలోని దామెర, పులుకుర్తి, తక్కళ్లపాడ్ గ్రామాల్లో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో రైతులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు వేదికల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గురిజాల శ్రీరాంరెడ్డి, పుల్యాల రాణి రఘుపతిరెడ్డి, గోవిందు అశోక్, శ్రీనివాస్, జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని ఆత్మకూరు, నీరుకుళ్ల, పెద్దాపూర్ గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతు దినోత్సవం నిర్వహించారు. తొలుత రైతులు, ప్రజాప్రతినిధులు ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, సర్పంచ్‌లు బలరామ్, కమల, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ చేతన్‌రెడ్డి, ఏఓ యాదగిరి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ ఎన్కతాల్ల రవీందర్, కోఆర్డినేటర్లు బాషబోయిన సాగర్, అంధ్య విశ్వేశ్వర్‌రెడ్డి, రాయరాకుల రవీందర్, మాజీ మార్కెట్ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : మండలంలో రైతులు ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీఓ రాము మాట్లాడారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఏసీపీ జూపల్లి శివరామయ్య, సీఐ కిషన్, తహసీల్దార్ మహేందర్, ఎంపీపీ అనసూర్య, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ఎల్కతుర్తి : రైతు వేదికకు వస్తున్న కలెక్టర్


దామెర : మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్


ఆత్మకూరు : ర్యాలీలో ఎంపీపీ సుమలత

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


ఆత్మకూరు : బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు


ఐనవోలు : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, తదితరులు

ఆత్మకూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు నిర్మలకుమారి, లక్ష్మణ్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి హెచ్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పౌష్టికాహారం, పుస్తకాలు, యూనిఫారం ప్రభుత్వమే అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్, వంగాల భగవాన్‌రెడ్డి, రేపూరి ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం గ్రామంలో బడిబాట కార్యక్రమ కరపత్రాలను సర్పంచ్ బరిగల ఆరోగ్యం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్యార్హతలు కలిగిన టీచర్లు ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ తాటికాయల శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం, దుస్తులు, తదితర అనేక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. హెచ్‌ఎం చుంచుకాల లింగారావు మాట్లాడుతూ ఈనెల 17 వరకు బడిబాట కొనసాగుతుందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఉమాదేవి, అంగన్‌వాడీలు కొండేటి ప్రణీత, రాధిక, వార్డు సభ్యురాలు మమత, ఆశా వర్కర్ ఆరోగ్య పాల్గొన్నారు.


ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని ధర్మసాగర్, ఇతర గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాల విద్యా కమిటీలు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్, వేలేరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీ లీలాబాయి, ఉపాధ్యాయురాలు సుజాత, సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఇంటింటినీ సందర్శించారు. కన్నారం మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎం హున్యానాయక్ ఆధ్వర్యంలో ఎంఎన్‌ఓ మహేష్ నాయక్ చేతుల మీదుగా బడిబాట కరపత్రాన్ని ఆవిష్కరించి విద్యార్థుల నమోదు కోసం ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పేరిట ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కమలాపూర్ : ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ధూపదీప నైవేద్య ఆలయాల్లో అర్చకులు సీఎం కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వం పేరిట శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చన, అభిషేకాలు చేశారు. అనంతరం అర్చకులు మాట్లాడారు. తమ గౌరవ వేతనాలు పెంచినందుకు సీఎం కేసీఆర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో అర్చకులు గోవర్ధనగిరి నర్సయ్య శర్మ, తిరువేంగళాచార్యులు, ఉదయాచార్యులు, కృష్ణమాచార్యులు, సంపత్‌కుమార్, శివయ్య, బూర శివానందం తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో పైరవీ విరమించుకోవాలి

కాశిబుగ్గ సెంటర్: కేజీబీవీల్లో బదిలీలకు పైరవీలు విరమించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేజీబీవీల బదిలీల్లో ఆన్‌లైన్ ఆప్షన్ ఇచ్చుకునే సమయానికి ఖాళీలను బ్లాక్(మాయం) చేయడం సరికాదని పేర్కొన్నారు. పర్వతగిరి స్పెషల్ ఆఫీసర్ బదిలీ కాకుండా ఆ పోస్టు ఖాళీ చూపించడం, ధర్మసాగర్ స్పెషల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంటే బ్లాక్ చేయడం ద్వారా పర్వతగిరి ఎస్‌ఓను అక్రమంగా ధర్మసాగర్ కేజీబీవీకి బదిలీ చేయడానికి చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలను ఆపకపోతే నిరసన ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పెట్రోల్‌లో నీళ్లు.. ఆందోళన

పరకాల : పట్టణంలోని హుజురాబాద్ రోడ్డులో మూడు రోజుల క్రితం కొత్తగా ప్రారంభమైన పెట్రోల్ బంక్‌లోనిని పెట్రోల్‌లో నీళ్ల కలిసినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు వాహనదార్లు పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్‌లో నీళ్ల వచ్చాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్ పోసుకున్న కొందరి వాహనాలు మోరాయింటంతో బాధితులు మెకానిక్‌లకు చూపించారు. ఈ క్రమంలో పెట్రల్‌లో నీళ్ల కలిసినట్టు తేలిందని వాహనదార్లు తెలిపారు. తమ వాహనాలను సర్వీసింగ్ సెంటర్లకు తరలించాల్సి దుస్థితి వచ్చిందని వాహనదార్లు ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్‌లో ఇథనాల్ కలవటంతో నీళ్ల మాదిరిగా కనిపించిందని బంక్ యాజమాన్యం తెలిపింది. సమస్యను కంపెనీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమకు జరిగిన నష్టాన్ని ఎవరు భరిస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు.


పెట్రోల్‌లో నీళ్లను చూపిస్తున్న వాహనదారులు

'రాజకీయ జిమ్మిక్కులకు వేదికగా..'

ఐనవోలు : ఐనవోలు మండలం రాజకీయ జిమ్మిక్కులకు వేదికగా మారిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండానే రైతుబంధు మండల కన్వీనర్‌గా మునిగాల సంపత్‌ను ఇటీవల ఎమ్మెల్యే రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ప్రకటించారని చెప్పారు. రైతు ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన సమావేశంలో రైతుబంధు కన్వీనర్ హోదాలో సంపత్‌ను అధికారులు వేదికపై కూర్చోబెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు బీఆర్‌ఎస్ నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో జిల్లాస్థాయి అధికారులున్నా పట్టించుకోలేదన్నారు. రైతుబంధు కన్వీనర్ నియామకం గురించి అధికారిక ఉత్తర్వులు తమకు ఇవ్వాలని వ్యవసాయ అధికారిణిని అడిగితే దాటవేత ధోరణి అవలంభించారని చెప్పారు. ఇప్పటికే మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌ను కూడా ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండానే అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారనే అంశంపై పలువురు కోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని బీఆర్‌ఎస్ నాయకుల ఆగడాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కూస చిరంజీవిరెడ్డి, అధికార ప్రతినిధి కొత్తూరు సునీల్, గ్యాదర భాస్కర్, రహీం పాషా, బొమ్మినేని రాకేశ్‌రెడ్డి, కడుదూరి హరీష్‌రెడ్డి, బరిగల భాస్కర్, మానుపాటి రాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు

● ఇంటర్ 'ఒకేషనల్' టాపర్లకు సన్మానం

పరకాల : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదువుకుంటే బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపత్‌కుమార్ తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్ వృత్తివిద్యా కోర్సుల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ఆవరణలో శనివారం ఆయన సన్మానించి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్యాబోధన లభిస్తుందని, ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. ప్రైవేట్ కళాశాలల్లో చదివించడం ఆర్థికంగా భారమని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పిల్లలను చేర్పాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కె.సంపత్‌కుమార్, అధ్యాపకులు

ప్రమాద బీమా చెక్కు అందజేత

కమలాపూర్ : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త చుక్క అజయ్ ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతడి తల్లి రమకు పార్టీ తరపున మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్మూరి వెంకట్ శనివారం అందజేశారు. అనంతరం మండలంలోని గూనిపర్తిలో మాజీ సర్పంచ్ వడ్డె చంద్రమౌళి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను వెంకట్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్‌పటేల్, నాయకులు వీరన్న, వీరేశం, ఆదాం, లింగన్న, శ్రీనివాస్, నోమేష్, అనిల్, యూత్ కాంగ్రెస్ నాయకుడు మనీష్, కుమార్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు హనుమాన్ ప్రసాద్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న బల్మూరి వెంకట్

అకాల వర్షాల్లో విత్తనాలు నాటొద్దు

శాయంపేట : కొద్ది రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్న క్రమంలో విత్తనాలు నాటొద్దని రైతులకు ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఫీల్డ్ ఫెసిలిటేటర్ కల్పన సూచించారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఆ కంపెనీ, బీసీఐ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల వేడికి విత్తనాలు దెబ్బతిని మొలకలు రాక నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. 60 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదైతే భూమిలో తేమ శాతం పెరుగుతుందని, ఆ పరిస్థితుల్లో విత్తనాలు నాటితే మొలకలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు అంతర పంటలు సాగు చేసుకోవాలని కోరారు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ విధానంలో సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కల్పన

5, 6 తేదీల్లో కళాభారతి స్వర్ణోత్సవాలు


ఆహ్వాన పత్రికను ప్రదర్శిస్తున్న సంస్థ బాధ్యులు

నయీంనగర్: కళాభారతి సాంస్కృతిక సంస్థ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 5, 6తేదీల్లో ఆరెపల్లిలో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు బుద్దె సాంబయ్య తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ 1971లో స్థాపించి ఇప్పటివరకు సాంఘిక, సామాజిక, సాంస్కృతిక సందేశాత్మకమైన నాటకాలను నిరంతరంగా ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. స్వర్ణోత్సవాలకు ముఖ్యఅతిథులుగా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వి.శ్రీనివాస్ గౌడ్, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు, తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రామోజు సుందరమూర్తి, రవీందర్ రావు, జనగాం కుమారస్వామి, బుద్దె గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆత్మవిశ్వాసం పెంపు

హన్మకొండ చౌరస్తా: క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వలన ఆత్మవిశ్వాసం పెరుగుతుందని 58వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఎం.మోహన్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో శనివారం యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు మొగిలయ్య పర్యవేక్షణలో సాగిన కార్యక్రమంలో పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్, బాధ్యులు లింగారెడ్డి, విజయ్‌కుమార్, చంద్రమౌళి, గిరిజ, భారతి, చంద్రశేఖర్, అశోక్, రాజేందర్‌రెడ్డి, 2వ కమాండెంట్లు మణిజి.నాయర్, డిప్యూటీ కమాండెంట్ సుమ, తులసి, ధనసాయి, లక్ష్మి పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు, వాకర్లు

జాదవ్ సుభాష్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్: హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన జాదవ్ సుభాష్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (అనంతపురం జేఎన్‌టీయూ) డాక్టరేట్ ప్రకటించింది. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలో పరిశోధకుడిగా 'డిజైన్ డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ గ్యాస్ట్రోరెంటేటివ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ ఆఫ్ లోరాటాడిన్ అండ్ ఫెల్లోడిపిన్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను జాదవ్ సుభాష్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూయేషన్ ప్రొఫెసర్ కేశవరెడ్డి ప్రకటించారు. కాగా, హనుమకొండ జిల్లాలోని ఉనికిచర్లలోని శ్రీకాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో సుభాష్ ప్రస్తుతం అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల తోటి అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందనలు తెలిపారు.